సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ၊ 31 ၊ డిసెంబర్ ၊ 2024



చీనీ టన్ను రూ.27,420

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27,420, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.7

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.7 మేర ధర పలికింది. మార్కెట్‌కు 1,200 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
31.9°/ 13.7°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు 'ఎన్టీఆర్ భరోసా' పంపిణీ



పుట్టపర్తి అర్బన్: జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ డిసెంబర్ 31వ తేదీనే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఆదేశాలు అందినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. జిల్లాలో 2,64,629 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.114.46 కోట్లు మంజూరు చేసింది. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ పింఛన్ పంపిణీ ప్రారంభించేలా సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం పింఛన్ తీసుకోలేని వారికి జనవరి 2వ తేదీ పింఛన్ ఇవ్వనున్నారు. నవంబర్‌లో 236 మంది మరణించిన వారి కుటుంబ సభ్యులకు కొత్త పింఛన్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు గత రెండు నెలల్లో పింఛన్ తీసుకోని వారికీ నగదు అందజేస్తారన్నారు.

28వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి



ప్రశాంతి నిలయం: జిల్లా పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరూ 2025 సంవత్సరానికి సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్‌ను జనవరి 1 తేదీ నుంచి 28వ తేదీలోపు సమీపంలోని ఉప ఖజానా కార్యాలయంలో సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి నాగమల్లిక సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మీ– సేవ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ సమర్పించవచ్చన్నారు. ఇందుకోసం 'జీవన్ ప్రమాణ్ పోర్టల్'ను సందర్శించాలని సూచించారు.

అలరించిన సంగీత కచేరీ



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మిరుపురీ సంగీత కళాశాల పూర్వ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిపై భక్తి ప్రపత్తులను చాటుతూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సోమవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలో సత్యసాయి మిరుపురీ సంగీత కళాశాల పూర్వ విద్యార్థులు కృతజ్ఞతా పూర్వక సంగీత కచేరీ నిర్వహించారు. గంట పాటు సాగిన కచేరీతో భక్తులు మైమరచిపోయారు. సత్యసాయి ప్రేమ, సేవా గుణాలను, ఆధ్యాత్మిక తత్వాన్ని కొనియాడుతూ చక్కటి భక్తి గీతాలు ఆలపించడంతో భక్తులు పరవశం చెందారు.

కారుచౌక ప్రయాణం!

జిల్లా కేంద్రం పుట్టపర్తి నుంచి బెంగళూరుకు 155 కి.మీ దూరం ఉంటుంది. గతంలో అయితే ఉదయం బయలుదేరితే ఏ సాయంత్రానికో చేరుకునే వారు. కానీ ఇప్పుడు ఒకే రోజులో వెళ్లి వచ్చేస్తున్నారు. దినసరి కూలీలు కూడా ఇప్పుడు ఉదయం వెళ్లి పని చేసుకుని కూలి డబ్బులతో తిరిగి సాయంత్రం గూటికి చేరుతున్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని 'కార్ పూలింగ్' కల్చర్‌కు అలవాటు పడ్డారు. దీంతో 'కారు'చౌక ప్రయాణం సాగిస్తున్నారు. ఫలితంగా వినియోగదారులకు అనుకూలంగా చాలామంది కార్లు కొని పూలింగ్ విధానం అనుసరిస్తున్నారు.

- పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి యలహంకలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుంటాడు. బెంగళూరులో ఫ్యామిలీ పెట్టాలంటే ఖర్చు కూడుకున్న పని అందుకే స్వగ్రామం నుంచే రోజు అప్ అండ్ డౌన్ చేస్తున్నాడు. ఇందుకోసం 'కార్ పూలింగ్'ను ఎంచుకున్నాడు. బస్సు చార్జీల రేటుకే గంటల వ్యవధిలోనే గమ్యస్థానం చేరుకుంటున్నట్లు చెబుతున్నాడు.

- గోరంట్లకు చెందిన ఓ కుటుంబంలోని నలుగురు వ్యక్తులు జాలహళ్లిలో ఓ ఫ్యాక్టరీలో పనికి కుదిరారు. కుటుంబాలతో సహా అక్కడికి వెళ్లడం కుదరక రోజూ బెంగళూరు వెళ్లి అక్కడ పనులు చేసుకుని తిరిగి ఇంటికి వచ్చేస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా 'కారు పూలింగ్' సేవలు వినియోగించుకుంటున్నట్లు వివరించారు. బస్సు చార్జీల కంటే తక్కువే ఉంటోందంటున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న 'కార్ పూలింగ్' కల్చర్
- తక్కువ ధరకే మెట్రో సిటీ బెంగళూరుకు ప్రయాణం
- నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం
- ఉద్యోగులంతా 'కార్ పూలింగ్'కే మొగ్గు
- సమయంతో పాటు డబ్బు, ఇంధనం ఆదా
- పెరిగిన టెక్నాలజీతో ఎందరికో ఉపయోగం
- సమయానికి గమ్యస్థానం చేరేందుకు అవకాశం

సాక్షి, పుట్టపర్తి

అద్దె కారు ప్రయాణం ఖరీదైంది. ఇద్దరు.. నలుగురు కలిసి హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నుంచి పొరుగు రాష్ట్రం కర్ణాటక రాజధాని బెంగళూరు వెళ్లాలంటే రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు అవుతోంది. బస్సుల్లో రద్దీ, సమయం వృథా, సిటీలో ట్రాఫిక్ జామ్ నేపథ్యంలో చాలామంది కారులో ప్రయాణించేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే అందుబాటులోకి వచ్చిన టెక్నాలజీ.. కారు ప్రయాణాన్ని చౌక ధరలకే అందిస్తోంది. 'కార్ పూలింగ్'కు కొన్ని మొబైల్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో జిల్లాలోని చాలామంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

పెరిగిన 'కార్ పూలింగ్' కల్చర్..

కర్ణాటక సరిహద్దున ఉండే జిల్లాలో కార్ పూలింగ్ సంప్రదాయం పెరిగిపోతోంది. డిమాండ్‌కు అనుగుణంగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య కూడా పెరిగింది. ఫలితంగా విద్యార్థులు, ఉద్యోగులు కార్ పూలింగ్ ద్వారా బెంగళూరుకు వెళ్లి వస్తున్నారు. ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ, గోరంట్ల, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాలకు చెందిన చాలామంది ఉద్యోగులు, రియల్ ఎస్టేట్, వ్యాపారులు, చిరుద్యోగులు, కూలీలు కార్ పూలింగ్‌లో రోజూ ప్రయాణిస్తున్నారు. తక్కువ చార్జీకే కారు ప్రయాణం అందుబాటులోకి రావడంతో రాకపోకలు సాగించే వారి సంఖ్య రెట్టింపయ్యింది.

నచ్చిన చోట పికప్, డ్రాప్..

బెంగళూరు వంటి నగరాల్లో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో దిగి.. అక్కడి నుంచి ఇంటికెళ్లాలంటే క్యాబ్‌కు రూ.200, రూ.300 చెల్లించాల్సిన పరిస్థితి. అదే యాప్ ద్వారా కార్లలో వెళ్తే నచ్చిన చోట పికప్, డ్రాప్ సదుపాయం ఉంటుందని చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అందువల్లే పుట్టపర్తి, గోరంట్ల, పెనుకొండ నుంచి బెంగళూరు వెళ్లే వారు కార్ పూలింగ్ సంప్రదాయాన్నే అనుసరిస్తున్నారు.

ఆర్నెల్లలో పెరిగిన వ్యాపారం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికంగా ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపోయాయి. దీంతో చాలా మంది ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులతో పాటు దినకూలీలు రోజూ బెంగళూరు వెళ్లి వస్తుంటారు. రైళ్లు సమయానికి అందుబాటులో లేకపోవడం.. బస్సుల్లో వెళ్తే చార్జీలు ఎక్కువగా ఉండటంతో కార్ పూలింగ్ కల్చర్‌కు అలవాటు పడ్డారు. ఈ ఏడాదిలోని తొలి ఆర్నెల్లతో పోలిస్తే.. తర్వాత ఆర్నెల్లలో రాకపోకలు సాగించే వారి సంఖ్య రెట్టింపయినట్లు కార్ పూలింగ్ నిర్వాహకులు చెబుతున్నారు.



కార్ పూలింగ్ అంటే

బెంగళూరు నుంచి అనంతపురం వస్తున్న అతను తన కారులో ఇతరులను చార్జీ తీసుకుని ఎక్కించుకోవడం. ఇలా ఒకే కారులో నలుగురు, ఐదుగురు కలిసి బస్సు చార్జీల రూపంలో చెల్లిస్తారు. తక్కువ ఖర్చుతో కారులో ప్రయాణించే విధానం. నచ్చిన చోట పికప్, డ్రాపింగ్ ఉండటంతో చాలామంది మొగ్గు చూపుతున్నారు. మరోవైపు కారులో డ్రైవరు మాత్రమే వెళ్లే సందర్భంలో.. ఇతరులను బస్సు చార్జీల రేటుకే అనుమతించి ఎక్కించుకుని ప్రయాణించడం. ప్రముఖ నగరాల్లో వ్యాప్తి చెందిన కార్ పూలింగ్ విధానం చిన్న చిన్న పట్టణాల వరకు వ్యాపించడం విశేషం.

బెంగళూరులు చార్జీలు ఇలా

ప్రాంతం	నాన్ ఏసీ బస్సు చార్జీ (రూ.ల్లో)	కారు పూలింగ్‌లో చెల్లించే మొత్తం (రూ.ల్లో)
పుట్టపర్తి	246	300
గోరంట్ల	192	250
ధర్మవరం	273	350
కదిరి	288	400
కొడికొండ చెక్‌పోస్టు	176	200
హిందూపురం	155	200
పెనుకొండ	175	300
మామిళ్ల పల్లి	310	400
అనంతపురం	340	400

రెండు విధాలుగా లాభమే..

కార్లు లేని వారికే కాదు.. సొంత వాహనాలు ఉన్న వారికి కూడా కార్ పూలింగ్ యాప్‌లు ఉపయోగపడుతున్నాయి. వారంతపు సెలవులు, పండుగల సమయాల్లో సొంతూళ్లకు వస్తున్న వారు.. యాప్ ద్వారా ఇతరులను వాహనాల్లో తీసుకొచ్చి.. లాభాలు పొందే అవకాశం ఉంది. కుటుంబ సభ్యులను ఊర్లో దింపి.. తిరుగు పయనంలో ఒంటరిగా వెళ్తున్న సమయంలో చాలామంది యజమానులు ఈ యాప్ ద్వారా ప్రయాణికులను తీసుకెళ్తుంటారు. బ్లాబ్లా, క్విక్ రైడ్ తదితర యాప్‌లపై చాలామంది అవగాహన కలిగి ఉన్నారు. బస్సు చార్జీలనే కార్లలో కూడా తీసుకుంటున్న నేపథ్యంలో చాలామంది కార్ల వైపే మొగ్గు చూపుతున్నారు.

పండుగ సమయాల్లో రద్దీ..



ముఖ్యమైన పండుగల సమయంలో రైళ్లలో సీట్లు దొరకవు. బస్సుల్లో సీట్లు ఫుల్ అవుతాయి. ఉన్నఫలంగా ఊరెళ్లాలనుకునే వారికి కార్ పూలింగ్ బాగా ఉపయోగపడుతోంది. నిమిషాల్లో సీటు దొరకడం.. గంటల వ్యవధిలో గమ్యస్థానానికి చేరుకోవడం.. చకచకా జరిగిపోతున్నాయి.

సమయం, ఇంధనం ఆదా..



కార్ పూలింగ్‌తో సమయంతో పాటు ఇంధనం కూడా ఆదా అవుతోంది. ఒకే కారులో నలుగురు ప్రయాణిస్తున్న కారణంగా డబ్బు షేరింగ్ చేసుకుంటారు. ఒకసారి ఇంధనం కొట్టించి.. అందరూ ఒకేసారి ప్రయాణిస్తారు. ఎవరికి వారుగా ఒక్కొక్కరు ఒక్కో వాహనంలో వెళ్తే డబ్బు ఖర్చు కావడంతో పాటు ఇంధనం వృథా అవుతుంది. ట్రాఫిక్‌జామ్ అవుతుంది.

ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 228 అర్జీలను అందగా, పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖలకు పంపారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై విచారిస్తారని, అందువల్ల అధికారులంతా ముందుగానే అర్జీల పరిష్కారంపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయాన్ని గుర్తించి అర్జీదారు సంతృప్తి చెందేలా సమాధానం ఇవ్వడంతో పాటు, వారి అభిప్రాయాన్ని సైతం తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య పరిష్కారం అయినప్పుడు మాత్రమే డిస్పోజ్ చేయాలనీ, అలా కాకుండా తప్పుడు ఎండార్స్‌మెంట్‌లు ఇచ్చినా, సమాధానం సక్రమంగా ఇవ్వకపోయినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోర్టు కేసులు, ఆర్థికపరమైన సమస్యలతో ముడిపడిన అర్జీలు తప్ప మిగతా వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

అర్జీదారుల కోసం ప్రత్యేక సౌకర్యాల ఏర్పాటు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చేందుకు వచ్చే వారి కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్జీదారులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే డివిజన్ల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయ సారథి, ఉమ్మడి జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ సైరా బేగం, డీఈఓ కృష్ణప్ప, సివిల్ సప్లయిస్ అధికారి వంశీకృష్ణారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు,ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో మందు, చిందు



కదిరి- హిందూపురం రోడ్డు పక్కన ఉన్న టిడ్కో భవనాల సముదాయం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- సమీపంలోనే కస్తూర్బా పాఠశాల
- భయం భయంగా గడుపుతున్న విద్యార్థులు

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గత టీడీపీ హయాంలో (2018) పట్టణంలోని 36 వార్డులకు చెందిన సుమారు 3 వేల మంది పేదలకు ఇక్కడ ఇళ్లు కేటాయించారు. ఈ భవనాలు 75 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. చాలా ఇళ్లు అసంపూర్తిగా ఉండిపోయాయి.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

టిడ్కో భవనాలు అసంపూర్తిగా నిలిపివేయడంతో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. రోడ్డుకు పక్కనే ఈ భవనాలు ఉండడంతో మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. దాంతో పాటు కొందరు ఈ భవనాల్లో వ్యభిచారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

భయపడిపోతున్న విద్యార్థినులు..

టిడ్కో ఇళ్ల సమీపంలోనే కస్తూర్బా బాలికల విద్యాలయం ఉంది. అక్కడ సుమారు 270 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం టిడ్కో భవనాల మీదుగానే పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. భవనాల చుట్టూ కంపచెట్లు, నడుము వరకు గడ్డి పెరగడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. అలాగే అసంపూర్తిగా ఉన్న టిడ్కో భవనాల్లో కొందరు మద్యం సేవిస్తూ ఉంటారు. ఒక్కోసారి ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగుతుంటారు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న విద్యార్థులపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే దిక్కెవరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు విద్యార్థులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టేందుకు టిడ్కో భవనాలపైకి ఎక్కి సెల్ఫీలు దిగడం లాంటివి చేస్తున్నారు. జరగరానిది జరిగితే జరిగే నష్టం ఎవరూ ఊహించలేదని. అందువల్ల పోలీసులు వెంటనే స్పందించి పగలు, రాత్రి ఒకసారి గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

భద్రత కల్పించాలి



ఇటీవల ఎక్కడ చూసినా బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. విద్యాసంస్థల పరిసరాల్లోనూ భద్రత పకడ్బందీగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కదిరి కసూర్బా బాలికల పాఠశాల పట్టణ శివారులో టిడ్కో ఇళ్ల వెనుక ఉంది. అసంపూర్తిగా ఉన్న టిడ్కో భవన సముదాయాల్లోకి ఎవరూ ప్రవేశించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– శివశంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ ఎస్‌యూ

జనవరిలో పనులు



'టిడ్కో' భవనాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఇదివరకే రాష్ట్ర పురపాలక శాఖమంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశం నిర్వహించారు. జనవరిలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించే అవకాశం ఉంది. జూన్‌లోపు లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

– కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కదిరి

సిబ్బందిని రోజూ పంపిస్తాం



టిడ్కో భవనాల వద్దకు పోలీసులను రోజు రౌండ్స్‌కు పంపిస్తా. ఎవరైనా అక్కడ మద్యం సేవిస్తూ ఉన్నా..ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా కఠిన చర్యలు తీసుకుంటాం. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలూ సమాచారం ఇవ్వవచ్చు. తప్పక చర్యలు తీసుకుంటాం.

– నారాయణరెడ్డి, పట్టణ సీఐ

నేరాలు తగ్గాయి

- గత ఏడాదితో అన్ని రకాల నేరాలు 31.9 శాతం తగ్గాయి
- సైబర్ నేరాలు మాత్రం పెరిగాయి
- 2024 వార్షిక నేర నివేదిక వెల్లడించిన ఎస్పీ రత్న



వార్షిక నేర నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ రత్న, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: క్షేత్రస్థాయిలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో ఈ ఏడాది జిల్లాలో ప్రధాన నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలో వార్షిక నేర నివేదికను మీడియాకు విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసుల పనితీరు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, పీడీ చట్టం ప్రయోగం, పల్లె నిద్ర వంటి చర్యలతో గత ఏడాదితో పోలిస్తే 31.9 శాతం నేరాలు తగ్గాయన్నారు.

నూతన పోలీసింగ్‌కు శ్రీకారం..

రానున్న కొత్త ఏడాది జిల్లాను నేర రహితంగా తీర్చి దిద్దేందుకు నూతన పోలీసింగ్ వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని ఎస్పీ రత్న తెలిపారు. రాబోవు రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అందిపుచ్చుకొని నేర నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణస్వామి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ప్రదీప్, లీగల్ అడ్వయిజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

వార్షిక నివేదికలోని ప్రధానాంశాలు ఇలా..

- ఈ ఏడాది వివిధ నేరాలకు సంబంధించి 627 కేసులు నమోదు, 2,752 మంది నిందితుల అరెస్టు. రూ.98,96,933 నగదు స్వాధీనం.
- 13 గంజాయి కేసుల్లో 36 మంది నిందితుల అరెస్టు. 24.1 కిలోల గంజాయి స్వాధీనం.
- 107 ప్రాపర్టీ కేసులు నమోదు. పదే పదే నేరాలకు పాల్పడుతున్న నలుగురిపై పీడీ యాక్ట్ ప్రయోగం. 126 మందిపై రౌడీ షీట్లు.
- 475 అక్రమ మద్యం కేసులు నమోదు. 579 మందిపై కేసులు. 8,894.97 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం.
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి ఈ సంవత్సరం 102 కేసులు నమోదు.
- గత ఏడాది జిల్లాలో 39 హత్యలు జరగ్గా, ఈఏడాది 29 నమోదయ్యాయి.
- చీటింగ్ కేసులు గతే ఏడాది 271 నమోదు కాగా, ఈఏడాది 182 కేసులు నమోదయ్యాయి.
- ఈ ఏడాది 39 సైబర్ కేసులు నమోదు. రూ.3,46,97,202 సొమ్ము గల్లంతు.
- గత ఏడాది మిస్సింగ్ కేసులు 546, ఈఏడాది 531 కేసులు నమోదయ్యాయి.
- విచారణలో ఉన్న 32 కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడ్డాయి. లోక్ అదాలత్‌లో 3,119 కేసులు పరిష్కారమయ్యాయి.
- 580 మొబైల్ ఫోన్లు రికవరీ. ఈఏడాది డయల్ 100లో 10,491 కాల్స్ రాగా, 10 నిమిషాలలో బాధితులకు సాయం అందింది.

ఈ ఏడాది త్వరగా ఛేదించిన కేసులు ఇలా..

- మడకశిర రూరల్ మండలం గుడిబండ పోలీ స్టేషన్‌లో పరిధిలో 26 ఏళ్ల క్రితం జరిగిన బాలుడి హత్య కేసు, చిలమత్తూరు పోలీస్టేషన్ పరిధిలో జరిగిన గ్యాంగ్ రేప్ కేసు, హిందూపురం రూరల్ పోలీస్టేషన్‌లో బాలికపై అత్యాచారం, హత్య కేసు, మడకశిర సమీపంలో బాలుడు కిడ్నాప్, హత్య కేసును పోలీసులు గంటల్లోనే ఛేదించారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

పెండింగ్ కేసులను త్వరగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఎస్పీలు, సీఐలతో ఆమె డిసెంబర్ నెలకు సంబంధించిన నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పోలీస్టేషన్లలో నమోదైన కేసులు వివరాలు తెలుసుకొని నేరాలు, శిక్షలు, కోర్టు కేసుల పురోగతిపై పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం వివిధ కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబరచిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడారు. కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఆ దిశగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించిన నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయడంతో పాటు వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య, పోక్సో, రోడ్డు ప్రమాదాల కేసులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తే జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించవచ్చన్నారు. సారా విక్రయాలు, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. విజుబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. చోరీల నివారణకు రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ రత్న సిబ్బందికి సూచించారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 19 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 19 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని, చట్టపరిధిలోని వాటికి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

హిందూపురం అర్బన్: స్థానిక విద్యానగర్‌లో నివాసముంటున్న వ్యాపారి భరత్‌కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు పొరుగున ఉన్న బెంగళూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం వేసిన ఇంటిని గుర్తించిన దుండగులు సోమవారం వేకువజామున ఇంట్లోకి చొరబడి విలువైన బంగారు, నగదు అపహరించుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భరత్ కుమార్, ఆయన కుటుంబసభ్యులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి లోపలకెళ్లి పరిశీలించారు. బీరువాలో దాచిన రూ.10 లక్షల నగదు, 150 గ్రాముల బంగారు నగలు అపహరించుకెళ్లినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలి ముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

కూడేరు: మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన బలిజ సంజీవరాయుడు కుమారుడు సందీప్(35) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటున్న సందీప్ తమ పొలంలో ఉన్న కొబ్బరి చెట్టు పట్టలు తగలి తరచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజులు పోతున్నట్లుగా గుర్తించాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం కొబ్బరి పట్టలు కొట్టేందుకు చెట్టుపైకి ఎక్కిన సందీప్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. అక్కడే ఉన్న విజయ్ అనే వ్యక్తి ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సందీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, సందీప్‌కు భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

2025 పారాహుషార్!

- న్యూ ఇయర్ విషెస్ పేరుతో సైబర్ నేరగాళ్ల కొత్త ప్లాన్
- శుభాకాంక్షల పేరుతో బురిడీ కొట్టించే యత్నం
- పొరపాటున లింక్ క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ



ధర్మవరం అర్బన్: నూతన సంవత్సరం అనగానే ప్రతిఒక్కరూ వారి వాట్సాప్, ఎస్ఎంఎస్, టెలిగ్రామ్‌లలో వచ్చే లింక్‌లు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. పొరపాటున ఈ లింక్‌లు క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ అవడం గ్యారంటీ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు వ్యక్తిగత డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతుందని అంటున్నారు. దీంతో న్యూ ఇయర్ విసెస్ చెబుతూ వచ్చే మెసేజ్‌లు, లింక్‌లు ఎవరూ క్లిక్ చేయకపోవడమే మంచిదని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

గిఫ్ట్ ఓచర్లతో బురిడీ..

ఒక్కరోజులో నూతన సంవత్సరం రానుండటంతో సైబర్ నేరగాళ్లు ఇదే అదనుగా దోపిడీ వల విసిరారు. ఫలానా వారు మొబైల్ ఫోన్లలోని వాట్సాప్‌లకు స్పందించి న్యూ ఇయర్ విసెస్ చెబుతూ గిఫ్ట్ ఓచర్ గెలుచుకున్నారని వచ్చే లింక్‌లు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయడం అందరిలోనూ ఉత్సాహాన్ని రేకెత్తిస్తుండడం సర్వసాధారణం. దీంతో మొబైల్‌కు మెసేజ్‌లు, వాట్సాప్‌లకు లింక్‌లు వచ్చినా వెంటనే ఓపెన్ చేయడం పరిపాటిగా మారింది. దీనిని తమకు సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుఉన్నారు. న్యూ ఇయర్ విసెస్ అంటూ పంపే లింక్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మీకు నచ్చినట్లు, మీ పేరు మీద గ్రీటింగ్స్, సందేశాలను పంపవచ్చని సూచిస్తారు. లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే మీ పేరుతో గ్రీటింగ్స్ క్రియేట్ చేస్తామని సైబర్ నేరగాళ్లు మాయమాటలతో ముంచేస్తారు. మొబైల్‌లోని వాట్సాప్, టెలిగ్రామ్, ఏపీకే ఫైల్స్ రూపంలో సందేశాలు పంపిస్తున్నారు. పొరపాటున ఆ లింక్‌లను క్లిక్ చేస్తే మీ బ్యాంకు ఖాతా మొత్తం ఖాళీ అయినట్లే. బ్యాంకు ఖాతా ఖాళీ అవ్వడంతోపాటు మొబైల్‌లోని కాంటాక్ట్ నెంబర్లు, ఫోటోలు, వీడియోలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, డాక్యుమెంట్ ఫైళ్లు మొత్తం సైబర్ నేరగాళ్ల చేతికి చేరుతాయి. దీంతో వారు చెప్పినట్లు మనం డబ్బులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

లింక్‌లకు దూరంగా ఉండడం ఉత్తమం..

హ్యాపీ న్యూ ఇయర్ అంటూ వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్‌లకు వచ్చే లింక్‌లు, ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయకుండా రెండు రోజులు దూరంగా ఉండడం చాలా ఉత్తమం. ట్రావెల్ గ్యాడ్జెట్స్, గిఫ్ట్ ఓచర్లు, వస్తువులపై 50 శాతం డిస్కౌంట్‌లు, ఈ సందేశం నలుగురికి పంపితే రీచార్జ్ ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు వలవేసి ప్రజల డబ్బు కాజేసేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో ఈ రెండు రోజులు ఎలాంటి లింక్‌లు క్లిక్ చేయకపోవడం, ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయకుండా ఉండడం ఉత్తమమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే డబ్బు భద్రం..

- మొబైల్ ఫోన్లలోని వాట్సాప్, టెలిగ్రామ్‌లకు వచ్చే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయరాదు.
- మొబైల్ సెట్టింగ్‌లో ఫోన్ నంబర్లను యాక్సెస్ చేసే అనుమతి ఇవ్వరాదు.
- ఈమెయిల్స్, ఇతరత్రా సోషల్ మీడియా యాప్‌ల ద్వారా వచ్చే నకిలీ లింక్‌లను క్లిక్ చేయరాదు.
- మన మొబైల్‌లో సేవ్ చేయని ఫోన్‌నెంబర్ల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లు, లింక్‌లను క్లిక్ చేయరాదు.
- ఫోన్‌లోని సెట్టింగ్‌లో ఇన్‌స్టాల్ ఫ్రం అన్‌నోన్ సోర్సెస్ అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేసుకోవాలి. ఇలా చేస్తే మనకు తెలియకుండా యాప్స్ ఇన్‌స్టాల్ కాకుండా ఉంటాయి.
- గిఫ్ట్ ఓచర్లు, షాపింగ్‌పై 50శాతం రాయితీ ఇలాంటి మెసేజ్‌లతో ప్రజలను ట్రాప్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని దోచుకునేందుకు ప్రయత్నిస్తారు.
- మొబైల్‌లో అధికారిక యాప్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

అప్రమత్తంగా ఉండాలి



నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో చాలా మంది వాట్సాప్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దు. ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగమై ఉంటుంది. ఎవరికైనా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపాలనుకుంటే వారికి నేరుగా ఫోన్ చేసి చెప్పండి లేదా మెసేజ్‌లు చేయండి. అంతేగాని మీ మొబైల్‌కు వచ్చే లింక్‌లు, ఏపీకే ఫైళ్లు క్లిక్ చేస్తే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయి. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండటంతో పాటు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలి.

– నాగేంద్రప్రసాద్, వన్‌టౌన్ సీఐ, ధర్మవరం టౌన్

పీఆర్‌టీయూ క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్, తదితరులు

పుట్టపర్తి: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను కలెక్టర్ టీఎస్ చేతన్, డీఈఓ కృష్ణప్ప ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు సి.రామకృష్ణారెడ్డి, రజనీకాంతరెడ్డి, దామోదరరెడ్డి, చిదంబరరెడ్డి, రామాంజి, సంజీవరెడ్డి, సుధాకర్, శివారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీగా శెట్టిపి


శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీగా ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. అనంతపురంలోని అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ధర్మవరం నుంచి మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టుకు వరుసగా మూడుసార్లు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా పట్టణంలో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి 22 సంవత్సరాలుగా ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. బాల, బాలికలను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తున్న జయచంద్రారెడ్డిని ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీగా ఎంపిక చేయడంపై హర్షం చేశారు. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు, యూటీఎఫ్ నాయకులు, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రామగిరి ఎంపీపీ మృతి

రామగిరి: మండల పరిషత్ చైర్‌పర్సన్ (ఎంపీపీ) మీనుగ నాగమ్మ (72) సోమవారం రాత్రి 10 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుమారుడు, సర్పంచ్ మీనుగ నాగరాజు తెలిపారు. కాగా, రామగిరి మండలానికి తొలి మహిళా బీసీ ఎంపీపీగా నాగమ్మ ఖ్యాతి దక్కించుకున్నారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మృతి తీరని లోటుగా మండల ప్రజలు పేర్కొన్నారు.

నట్టేట ముంచిన నాసిరకం కలుపు మందు

- ఆరు ఎకరాల్లో తుడిచిపెట్టుకు పోయిన టమాట పంట


పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

డి హీరేహాళ్(రాయదుర్గం): నాసిరకం కలుపు మందు నట్టేట ముంచిందని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు... డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన రైతు మురళీమోహన్‌రెడ్డి ఆరు ఎకరాల్లో టమాట సాగు చేశాడు. పెట్టుబడి కోసం ఇప్పటికే రూ.5 లక్షలు ఖర్చుచేశాడు. కలుపు నివారణ చర్యల్లో భాగంగా రాయదుర్గం లోని గ్రోమర్ దుకాణంలో టర్క సూపర్ అనే కలుపు మందు కొనుగోలు చేశాడు. దుకాణ నిర్వాహకుల సూచన మేరకు ఎకరాకు 250 ఎంఎల్ చొప్పున పిచికారీ చేశారు. సాయంత్రానికే పైరు మొత్తం కాలి వాలిపోయింది. నాసిరకం కలుపు మందే నట్టేట ముంచిందంటూ గ్రోమర్ సిబ్బందిని గట్టిగా నిలదీశారు. న్యాయం చేయకపోతే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాల్సి వస్తోందని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఉద్యాన శాఖ అధికారి మౌనిక, ఆగ్రోస్ సిబ్బంది పొలాన్ని సందర్శించారు. పంటను కాపాడే బాధ్యత తీసుకుంటామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదంటూ రైతుకు సర్దిచెప్పారు. వారం రోజుల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మొక్కలను కాపాడేందుకు అవసరమైన మందులను డ్రిప్ ద్వారా సరఫరా చేయించారు.


3న జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

అనంతపురం ఎడ్యుకేషన్: రాప్తాడు మోడల్ స్కూల్‌లో జనవరి 3న అనంతపురం జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు (సైన్స్‌ఫేర్) నిర్వహించనున్నట్లు ఆ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, సైన్స్ సెంటర్ అధికారి బాలమురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల 8,9,10 తరగతుల విద్యార్థులు సైన్స్, గణితానికి చెందిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని వెల్లడించారు. 2న మండలస్థాయిలో సైన్స్‌ఫేర్ నిర్వహించాలని సూచించారు. మండలస్థాయికి ప్రతి పాఠశాల నుంచి మూడు విభాగాల్లో (ఒకరు, గ్రూపు, టీచర్స్ కేటగిరి) ప్రాజెక్టులు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మండలం నుంచి మూడు విభాగాల్లో ఒక్కో ప్రాజెక్టును జిల్లాస్థాయికి ఎంపిక చేసి పంపాలని ఆదేశించారు. నవీనమైన, కొత్తకొత్త ఆవిష్కరణలు, ఆలోచనలకు అద్దంపట్టేలా ప్రాజెక్టులు తయారు చేసేలా సైన్స్,గణితం టీచర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. ఇదిలాఉండగా..విద్యార్థుల కేటగిరీల నుంచి ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు వస్తున్నా, టీచర్ల కేటగిరీ నుంచి మరి ఏమాత్రం భాగస్వామ్యం ఉంటుందో వేచి చూడాలి.

హత్య కేసులో ముద్దాయికి ఐదేళ్ల జైలు

అనంతపురం: హత్య కేసులో ముద్దాయికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడింది. అలాగే, రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. బుక్కరాయసముద్రం మండలం అనంతసాగర్ కాలనీకి చెందిన వినోద్‌కుమార్‌ను 2022 ఏప్రిల్ 14న అదే కాలనీకి చెందిన రత్నమయ్య కత్తితో ఛాతీపై పొడిచి దారుణంగా హత్య చేశాడు. గతంలో వైన్‌షాపుల వద్ద జరిగిన గొడవలను మనసులో పెట్టుకుని వినోద్‌కుమార్‌ను చంపితే.. అతని సామాజికవర్గంలో తానంటే భయం ఉంటుందనే కారణంతో దారుణంగా చంపాడు. ఈ హత్యా ఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు 2022 ఏప్రిల్ 15న కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ డి. రాము దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున 8 మంది సాక్షులను విచారించగా, మరూరు రత్నమయ్యపై నేరం రుజువైంది. దీంతో ముద్దాయికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సోమవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ రెడ్డి వాదనలు వినిపించారు. కేసులో బలమైన సాక్ష్యాలు సేకరించి ముద్దాయికి శిక్ష పడేలా అప్పటి సీఐ డి. రాము కృషి చేశారు. కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేశ్ నాయక్, ఏఎస్ఐ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు బి. రామమోహన్, ఏ. ప్రదీప్ కుమార్, లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు సాక్షులను కోర్టుకు హాజరుపరచడంలో కృషి చేశారు. వీరిందరినీ జిల్లా ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య


రాజేష్ (ఫైల్)

గుత్తి రూరల్: తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాన్ని కొనివ్వకపోవడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం శ్రీపురం గ్రామానికి చెందిన పులిశేఖర్, సరోజ దంపతుల కుమారుడు రాజేష్ (22) గుంతకల్లులోని కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో తల్లిదండ్రులతో కలసి కూలి పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో తనకు బైక్ కొనివ్వాలని కొన్ని నెలలుగా తల్లిదండ్రులను రాజేష్ ఒత్తిడి చేస్తూ వచ్చాడు. అయితే తమకున్న రెండు ఎకరాల పొలంలో చేపట్టిన పంటల సాగులో దిగుబడులు లేక అప్పుల పాలయ్యామని, కొన్ని రోజులు ఆగితే బైక్ కొనిస్తానని తండ్రి నచ్చచెబుతూ వచ్చాడు. ఆదివారం సాయంత్రం మరో సారి బైక్ కొనాలంటూ రాజేష్ మొండిపట్టు పట్టాడు. తలిదండ్రులు ఎంత నచ్చచెప్పినా వినలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం నిద్ర లేచి తల్లిదండ్రులతో పాటు సోదరి కూడా ఉపాధి పనులకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజేష్ పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లి... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రాజేష్‌ను చూసి బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకుని రాజేష్‌ను కిందకు దించి చూశారు. అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారణ కావడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేకాట ఆడుతూ పట్టుపడిన మహిళలు

కదిరి టౌన్: స్థానిక పూల బజారులోని బెస్తవీధికి చెందిన చింతలకుంట చెన్నకేశవులు.. సోమవారం ఉదయం తన ఇంట్లో భార్య, మరో ఐదుగురు మహిళలతో కలసి పేకాట ఆడుతుండగా పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. జూదరుల నుంచి రూ 50,220 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు. అలాగే కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల శివారున పులివెందుల రోడ్డు పక్కన ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద పేకాట ఆడుతున్న షేక్ రియాజ్ బాషా, వీరనారాయణ, శంకర, చలపతి, శ్రీరాములు, సూర్యనారాయణ, పూల ఉత్తన్న, మోహన్‌రావు, గాలివీటి నారాయణ, ఫారూక్ ఇమ్రాన్, ఓరకంటి కృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి, రూ.8,470 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

- ధర్మవరం రూరల్: మండలంలోని ఎలుకుంట్ల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.15,200లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం తనిఖీలు చేపట్టి జూదరులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

అట్రాసిటీ కేసులో ముగ్గురికి రిమాండ్



గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో దళితుడి ఇంటిని ధ్వంసం చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలను ఆయన సోమవారం వెల్లడించారు. ఈ నెల 20న రాత్రి ఇల్లూరు గ్రామానికి చెందిన మణికంఠ, స్వాతి దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు, అల్లాబకాష్ ఐచర్ వాహనంతో ఇంటిని ఢీకొని ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఘటనలో గాయపడిన దంపతుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఉదయం కల్లూరు గ్రామంలోని తరిమెల క్రాస్ వద్ద నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం


ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్



అనంతపురం: స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియంలో సోమవారం కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ పి. జగదీష్ ప్రక్రియను పర్యవేక్షించారు. మొత్తం ప్రక్రియ అంతటినీ వీడియో రికార్డింగ్ చేశారు. అభ్యర్థులు మైదానంలోకి అడుగు పెట్టింది మొదలు తిరిగి బయటకు వచ్చేంతవరకు ఆయా విభాగాల సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వర్తించారు. జనవరి 17 వరకు జరిగే ఈ ప్రక్రియకు పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది మొత్తం 6,479 మంది హాజరుకానున్నారు. కాగా, దేహదారుఢ్య పరీక్షల్లో ఏమైనా అనుమానం తలెత్తితే జనవరి 17వ తేదీన అప్పీలు చేసుకోవచ్చు.

మీడియాపై ఆంక్షలు..

పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి నీలం సంజీవరెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న ఈవెంట్ కవరేజీకి మీడియాకు అనుమతించలేదు. ఏ మీడియా సంస్థ ప్రతినిధులు కూడా లోపలికి వెళ్లడానికి వీల్లేదంటూ ఎస్పీ ఆదేశాలు జారీ చేయడం వివాదస్పదమవుతోంది. పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొంటూనే మీడియాను అనుమతించకపోవడం గమనార్హం. మరోవైపు వాహన రాకపోకలపైనా ఆంక్షలు విధించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేవలం అభ్యర్థులు వచ్చి, వెళ్లే సమయంలో ఆంక్షలు విధించవచ్చు. కానీ రోజంతా ట్రాఫిక్ మళ్లింపు చేసేలా పోలీసు అధికారులు నిర్ణయించడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండో పంటకు సిద్ధం



అనంతపురం నగర శివారున బోరు బావుల కింద వరి సాగుకు సిద్ధం చేసిన మడులు (ఇన్‌సెట్) సాధించే దిగుబడిపై ఆత్మ విశ్వాసం కనబరుస్తున్న రైతన్న

మొదటి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి ఇవ్వలేదు. కూటమి సర్కార్ నుంచి ప్రోత్సాహమూ లేదు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అటకెక్కించారు. పెట్టుబడి సాయాన్ని (అన్నదాత సుఖీభవ) ప్రభుత్వం అందిస్తుందో... లేదో తెలియదు. అయినా రైతులు రెండో పంట సాగుకు సిద్ధమయ్యారు. ఈ ప్రపంచంలో లాభాపేక్ష లేకుండా ప్రజల కోసం పాటుపడే ఉత్పత్తిదారుడు ఎవరైనా ఉన్నారా అంటే... అది అన్నదాత అనేది అక్షర సత్యమని వారు పడుతున్న కష్టాన్ని చూస్తే అర్థమవుతుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:


పాములాయి వద్ద వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు


వరి మడుల మధ్య భోజనం చేస్తున్న కూలీలు